# అధ్యాయం 1

## ఉపోద్ఘాతం

### 1.1 ఈ నివేదిక గురించి

ఇది భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (కాగ్) నివేదిక. ఎంపిక చేసిన పథకాలు, కార్యక్రమాల పనితీరునూ, ప్రభుత్వ శాఖలు, స్వయంపాలక సంస్థల ద్వారా నియమాల పాలననూ తనిఖీ చేయగా వెల్లడైన అంశాలు ఈ నివేదికలో ఉన్నాయి.

నియమపాలన తనిఖీలో, ప్రభుత్వ శాఖలు, సంస్థలు భారత రాజ్యాంగంలోని నిబంధనలు, సంబంధిత చట్టాలు, నియమాలు, నిబంధనలు, సంబంధిత అధికార్లు జారీ చేసిన వివిధ ఉత్తర్వులు, నిర్దేశాలను పాటిస్తున్నాయో లేదో తెలుసుకోవడానికి ఆ ప్రభుత్వ శాఖలు, సంస్థలు చేసిన ఖర్చులకు సంబంధించిన లావాదేవీలను తనిఖీ చేయడం జరుగుతుంది. పనితీరు తనిఖీలో నియమపాలన తనిఖీతో పాటుగా ఆయా పథకాలు/కార్యక్రమాలు/ప్రభుత్వ శాఖల లక్ష్యాలను పొదుపుతోనూ, సమర్థవంతంగానూ సాధించారా లేదా అని పరిశీలించడం జరుగుతుంది.

ఆడిటు తనిఖీలో వెల్లడైన అంశాల్లో ముఖ్యమైన వాటిని రాష్ట్ర శాసనసభల దృష్టికి తీసుకెళ్లడమే ఈ నివేదిక ప్రధాన ఉద్దేశ్యం. ఆడిటు ప్రమాణాల ప్రకారం, ఆడిటు పరిశీలనలు నివేదికలో పొందుపరచ దగ్గ స్థాయిని కల్గి ఉన్నాయా లేదా అనేది ఆ లావాదేవీల స్వభావం, పరిమాణం, వాటి సంఖ్యల ఆధారంగా నిర్ణయించాలి. సంబంధిత కార్యనిర్వాహక అధికారులు వాటిపై దిద్దుబాటు చర్యలు తీసుకునే విధంగానూ, తమ సంస్థల ఆర్థిక నిర్వహణ మెరుగుపడేలా తగిన విధానాలను, మార్గదర్శకాలను రూపొందించుకునే విధంగానూ ఆడిటు పరిశీలనలు ఉండాలి. ఆ విధంగా, ఆడిటు పరిశీలనలు మెరుగైన పాలనకు దోహదపడతాయి.

ఈ అధ్యాయంలో, ఆడిటు ప్రణాళిక, పరిధులపై వివరణతో పాటు ఎంపిక చేసిన పథకాల అమలులో గమనించిన ప్రధానమైన లోపాలు, సాధించిన విజయాలు, లావాదేవీల తనిఖీలో వెల్లడైన ముఖ్యమైన విషయాలు, ఇంకా, గత ఆడిటు నివేదికలపై తీసుకున్న చర్యలను క్లుప్తంగా వివరించడమైంది. ఎంపిక చేసుకున్న పథకాలు/కార్యక్రమాలు/ప్రభుత్వ శాఖలపై చేసిన పనితీరు తనిఖీలో వెల్లడైన విషయాలు అధ్యాయం-II లో ఉన్నాయి. అధ్యాయం-III లో, ప్రభుత్వ శాఖలు, స్వయంపాలక సంస్థల లావాదేవీల తనిఖీలో వెల్లడైన అంశాలు ఉన్నాయి.

### 1.2 ఆడిటు పరిధి వివరాలు

రాష్ట్రంలో సచివాలయ స్థాయిలో 30 ప్రభుత్వ శాఖలున్నాయి. ఇవి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శుల/ముఖ్య కార్యదర్శుల/కార్యదర్శుల ఆధ్వర్యంలో పనిచేస్తాయి. వీరికి ఉప కార్యదర్శులు/కమీషనర్లు/ఇంజనీర్స్-ఇన్-చీఫ్/చీఫ్ ఇంజనీర్లు/ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్/చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, వారి కింది స్థాయి అధికారులు సహాయపడతారు. రాష్ట్రంలో 57 స్వయంపాలక సంస్థలు ఉన్నాయి. ఈ ప్రభుత్వ శాఖలు/స్వయంపాలక సంస్థలను ప్రధాన మహాగణకాధికారి (సివిల్ ఆడిటు), ఆంధ్రప్రదేశ్ కార్యాలయంలోని సివిల్ విభాగం ఆడిటు చేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లతో పోలిస్తే, 2009-10 సంవత్సరంలో చేసిన ఖర్చుల వివరాలను పట్టిక-1 లో చూపడమైంది.

పట్టిక - 1 (రూపాయలు కోట్లలో)

| | 2007-08 | | | 2008-09 | | | 2009-10 | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| | ప్రణాళిక | ప్రణాళికేతర | మొత్తం | ప్రణాళిక | ప్రణాళికేతర | మొత్తం | ప్రణాళిక | ప్రణాళికేతర | మొత్తం |
| **రెవెన్యూ ఖర్చు** | | | | | | | | | |
| సాధారణ సేవలు | 1058 | 17112 | 18170 | 152 | 18578 | 18730 | 181 | 21211 | 21392 |
| సాంఘిక సేవలు | 8041 | 10619 | 18660 | 12303 | 12701 | 25004 | 10699 | 15058 | 25757 |
| ఆర్థిక సేవలు | 4802 | 12103 | 16905 | 6538 | 11269 | 17807 | 4562 | 11651 | 16213 |
| సహాయక గ్రాంట్లు | - | 249 | 249 | - | 313 | 313 | - | 86 | 86 |
| **మొత్తం** | **13901** | **40083** | **53984** | **18993** | **42861** | **61854** | **15442** | **48006** | **63448** |
| **క్యాపిటల్ ఖర్చు** | | | | | | | | | |
| క్యాపిటల్ పరివ్యయం | 12866 | (-)92 | 12774 | 10611 | (-)244 | 10367 | 13955 | (-)162 | 13793 |
| ఇచ్చిన లోన్లు, అడ్వాన్సులు | 2221 | 700 | 2921 | 3098 | 316 | 3414 | 1514 | 76 | 1590 |
| ప్రజారుణం చెల్లింపు* | - | - | 4993 | - | - | 4833 | - | - | 6277 |
| కంటింజెన్సీ నిధి* | - | - | 1 | - | - | 7 | - | - | 0 |
| ప్రజాపద్దుల నుండి చెల్లింపు* | - | - | 55126 | - | - | 74149 | - | - | 70243 |
| ముగింపు నగదు నిల్వ* | - | - | 8512 | - | - | 4973 | - | - | 5983 |
| **మొత్తం** | | | **84328** | | | **97743** | | | **97886** |
| **పూర్తి మొత్తం** | | | **138311** | | | **159597** | | | **161334** |

* ప్రణాళిక, ప్రణాళికేతర వర్గీకరణ వర్తించదు

## 1.3 ఆడిటు చేసే అధికారం

భారత రాజ్యాంగం లోని 149,151 వ అధికరణలు, ఇంకా కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ (విధులు, అధికారాలు, సర్వీసు నిబంధనల) చట్టం-1971 (డి.పి.సి. చట్టం) 'కాగ్' కు ఆడిటు నిర్వహించే అధికారాన్ని కల్పించాయి. డి.పి.సి. చట్టంలోని 13 వ సెక్షను[1] కింద ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ శాఖల ఖర్చులను కాగ్ ఆడిటు చేస్తారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (సివిల్ ఆడిట్), ఆంధ్రప్రదేశ్, 12 కేంద్ర స్వయంపాలక సంస్థలకు ప్రధాన ఆడిటర్ గానూ, 45 రాష్ట్ర స్వయంపాలక సంస్థలకు ఏకైక ఆడిటరు గానూ వ్యవహరిస్తారు. డి.పి.సి. చట్టంలోని 19వ[2], 20వ[3] సెక్షన్ల కింద ఈ సంస్థల ఆడిటు నిర్వహించడం జరుగుతుంది. ఇవి కాకుండా, పెద్ద మొత్తంలో ప్రభుత్వ నిధులను పొందే 330 స్వయంపాలక సంస్థలను కూడా డి.పి.సి. చట్టంలోని 14వ సెక్షను[4] కింద కాగ్ తనిఖీ చేస్తారు. కాగ్ జారీ చేసిన ఆడిటు ప్రమాణాలు, ఆడిటు-అకౌంట్ల నిబంధనలు-2007, ఇంకా, స్వయంపాలక సంస్థల తనిఖీకి సంబంధించిన సూచనల మాన్యువల్‌లలో వివిధరకాల ఆడిట్‌లకు సంబంధించిన మౌలిక సూత్రాలు, పద్ధతులను నిర్దేశించడమైంది. డి.పి.సి. చట్టంలోని 13వ సెక్షను కింద చేసే తనిఖీ కోసం సివిల్ ఇనస్పెక్షన్ మాన్యువల్‌ను అనుసరించడం జరుగుతుంది.

1 (i) రాష్ట్ర సంచిత నిధి నుండి జరిగే అన్ని లావాదేవీలు, (ii) రాష్ట్ర అత్యయిక నిధి, ప్రజాపద్దులకు సంబంధించిన అన్ని లావాదేవీలు, (iii) అన్ని వ్యాపార, తయారీ, లాభ-నష్టాల పద్దులు, బ్యాలన్సు షీట్లు, ఇతర ఉప పద్దుల తనిఖీ

2 రాష్ట్ర శాసనసభ చేసిన చట్టం ద్వారా/కింద ఏర్పాటైన కార్పోరేషన్ల (కంపెనీలు కానివి) పద్దులను సంబంధిత చట్ట నిబంధనల ప్రకారం తనిఖీ చేయడం

3 రాష్ట్ర గవర్నర్ చేసిన విజ్ఞప్తి మేరకు ఏదైనా సంస్థ పద్దులను తనిఖీ చేయడం. కాగ్ మరియు ప్రభుత్వం - ఇరు పక్షాలూ అంగీకరించిన షరతులు, నిబంధనల మేరకు ఈ తనిఖీ జరుగుతుంది.

4 రాష్ట్ర సంచిత నిధి నుండి గ్రాంట్లు లేదా లోన్ల ద్వారా పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం పొందిన సంస్థల అన్ని రాబడులూ, ఖర్చులనూ, రాష్ట్ర సంచిత నిధి నుండి గ్రాంట్లు లేదా లోన్ల రూపంలో, ఒక ఆర్థిక సంవత్సరంలో కోటి రూపాయలకు తక్కువ కాకుండా ఆర్థికసాయం పొందిన సంస్థలకు సంబంధించిన అన్ని రాబడులు, ఖర్చులను తనిఖీ చేయడం జరుగుతుంది

## 1.4 ఆడిటు ప్రణాళిక, నిర్వహణ

ఒక ప్రభుత్వ శాఖ లేదా సంస్థ మొత్తంలోనూ, అందులోని ఒక్కో యూనిట్‌లోనూ అక్రమాలు జరిగేందుకు ఏ మేరకు ఆస్కారం ఉందో మదింపు వేయడంతో ఆడిటు ప్రక్రియ మొదలవుతుంది. అవి చేసే ఖర్చు, వాటి కార్యకలాపాల తీవ్రత/సంక్లిష్టత, ఆర్థికపరమైన అధికారాలను అవి ఏ మేరకు కలిగి ఉన్నాయి, అంతర్గత నియంత్రణలు, వాటాదార్ల ప్రయోజనాలు అనే అంశాల ఆధారంగా ఈ మదింపు జరుగుతుంది. గత ఆడిటులో కనుగొన్న విషయాలను కూడా ఈ సందర్భంగా పరిగణనలోకి తీసుకోవడం జరుగుతుంది. ఈ మదింపు ఆధారంగా, ఎంతకాలానికి ఒకసారి ఆడిటు చేయాలి, ఎంతమేరకు ఆడిటు చేయాలనే విషయాలను నిర్ణయించడం జరుగుతుంది. ఏదైనా ఒక పథకం/విషయం ఆధారంగా చేసే ఆడిట్లకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. ఈ మదింపు ఆధారంగా 'వార్షిక ఆడిటు ప్రణాళిక' ను రూపొందించి, దాని ప్రకారమే ఆడిటును నిర్వహించడం జరుగుతుంది.

ఆడిటు పూర్తయిన ప్రతీ యూనిట్ కూ, ఆడిట్ లో కనుగొన్న విషయాలను తనిఖీ నివేదికల (ఐ.ఆర్.లు) ద్వారా ఆ యూనిట్ అధిపతికి తెలపడమౌతుంది. ఐ.ఆర్.ను అందుకున్న ఒక నెలలోపు ఆడిటు నివేదికలోని అంశాలకు సమాధానాలు సమర్పించమని కోరడం జరుగుతుంది. సమాధానాలు అందిన సందర్భాల్లో ఆయా ఆడిటు అభ్యంతరాలను ముగించడం లేదా ఆడిటు సూచనల అమలుకు తదుపరి చర్యలను సిఫార్సు చేయడం జరుగుతుంది. ఈ ఐ.ఆర్. లలోని ముఖ్యమైన ఆడిటు పరిశీలనలను ఆడిటు నివేదికలలో పొందుపరచడానికి అవసరమైన ప్రక్రియను చేపట్టడం జరుగుతుంది. ఈ ఆడిటు నివేదికలను భారత రాజ్యాంగంలోని 151 వ అధికరణం కింద రాష్ట్ర గవర్నరుకు సమర్పించడం జరుగుతుంది.

2009-10 సంవత్సరంలో, వివిధ ప్రభుత్వ శాఖలు/సంస్థలకు చెందిన 1,095 యూనిట్లను తనిఖీ చేయడమైంది. ఇందుకుగానూ, 11,767 పార్టీ - రోజులను వినియోగించుకోవడం జరిగింది. ఈ ఆడిట్‌లలో 'నియమపాలనపై తనిఖీ', 'పనితీరుపై తనిఖీ' లను నిర్వహించడమైంది. ఆడిటు చేసిన మదింపు ప్రకారం అక్రమాలకు ఆస్కారం ఎక్కువగా ఉన్న యూనిట్లను 'ఆడిటు ప్రణాళిక' లో చేర్చి ఆ యూనిట్లను ఆడిటు చేయడమైంది.

## 1.5 ప్రధాన మహాగణకాధికారి (సివిల్ ఆడిటు), ఆంధ్రప్రదేశ్ కార్యాలయ సంస్థాగత నిర్మాణం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని సివిల్ శాఖలు, కార్యాలయాలు, వాటి కింద పనిచేసే స్వయంపాలక సంస్థల తనిఖీని 'కాగ్' ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రధాన మహాగణకాధికారి (సివిల్ ఆడిట్) కార్యాలయం నిర్వహిస్తుంది. అంతేకాకుండా, రాష్ట్రంలో ఉన్న కేంద్ర ప్రభుత్వపు సివిల్ కార్యాలయాలు, స్వయంపాలక సంస్థల ఆడిటును కూడా ఈ కార్యాలయమే నిర్వహిస్తుంది. సివిల్, పనులు, ప్రాజెక్టులు, అటవీ విభాగాలకు సంబంధించి, ఈ ఆడిటు నిర్వహణ బాధ్యతల్లో ప్రధాన మహా గణకాధికారికి ఐదుగురు ఉన్నతాధికార్లు (గ్రూప్ ఆఫీసర్లు) సహాయపడతారు.



## 1.6 పనితీరు తనిఖీలోని ప్రధాన పరిశీలనలు

ప్రభుత్వ కార్యక్రమాల అమలుకు చేసిన ఖర్చు కనిష్ఠస్థాయిలోనే ఉందా, ఆ కార్యక్రమాల ద్వారా ఆశించిన లక్ష్యాలు, ప్రయోజనాలు నెరవేరాయా అనే అంశాలను పరిశీలించేందుకు 'పనితీరుపై తనిఖీ'ని నిర్వహించడం జరుగుతుంది. నిర్దేశిత కార్యక్రమాలు/పథకాల అమలును తనిఖీ చేసి, కార్యనిర్వాహక అధికారులు తగిన దిద్దుబాటు చర్యలను చేపట్టేందుకూ, పౌర సేవలు మెరుగుపడేందుకూ ఉపకరించే సిఫార్సులను చేయడానికి ప్రాధాన్యతనివ్వడమైంది. 'భారతీయ లెక్కలు మరియు తనిఖీ శాఖ' కోసం నిర్దేశించిన ఆడిటు ప్రమాణాలకు అనుగుణంగా ఆడిటు నిర్వహించడం జరిగింది. గణాంకశాస్త్రంలోని శాంప్లింగ్ పద్ధతులు, వివేచన ఆధారంగా ఆడిటు శాంపిళ్లను ఎంపిక చేసుకోవడమైంది. ఆడిటు పరిశీలనపై ఒక నిర్ధారణకు రావడానికీ, ఆడిటు సిఫార్సులను చేయడానికి ముందు ప్రభుత్వ సమాధానాలను పరిగణనలోకి తీసుకోవడం జరిగింది.

పనితీరు తనిఖీలను నిర్వహించడం ద్వారా వివిధ పథకాలు/కార్యక్రమాల అమల్లోని పలు ప్రధాన లోపాలపైనా, ఎంపిక చేసుకున్న ప్రభుత్వ శాఖల్లోని అంతర్గత నియంత్రణల నాణ్యత పైనా గత కొన్నేళ్లుగా ఆడిటు నివేదికలను వెలువరించడమైంది. ఆ నివేదికల్లో, ఆయా కార్యక్రమాల సఫలత, సంబంధిత ప్రభుత్వ శాఖల పనితీరులపై ప్రభావం చూపిన ప్రధాన లోపాలను ఆడిటు వెల్లడించింది.

కొన్ని పథకాలు, కార్యక్రమాల అమల్లో ప్రభుత్వ పనితీరుపై ప్రస్తుత నివేదికలో పొందుపర్చిన ఆడిటు పరిశీలనలను సంక్షిప్తంగా ఈ కింద పేర్కొనడం జరిగింది :

### 1.6.1 సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం

సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకాన్ని కేంద్ర ప్రాయోజిత పథకంగా రాష్ట్రమంతటా 1975 అక్టోబరులో ప్రారంభించారు. ఆరేళ్లలోపు పిల్లలు, కిశోర ప్రాయంలోని బాలికలు (11-18 సంవత్సరాల వయసు), గర్భిణులు, బాలింతల పరిపూర్ణ అభ్యున్నతికి ఈ పథకం రూపొందించారు. అదనపు పోషకాహారం, వ్యాధి నిరోధక మందులు, ఆరోగ్య పరీక్షలు, పోషకాలు, ఆరోగ్యంపై అవగాహన, 3-6 సంవత్సరాల పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య వంటి సౌకర్యాల ద్వారా ఈ పథకం లక్ష్యాలను సాధించవలసి ఉంది.

కేంద్ర సాయం అందుబాటులో ఉన్నా మొత్తం లక్షిత జనాభాకు ప్రయోజనం కల్పించటంలో రాష్ట్రం విఫలమవటంతో సమగ్ర శిశు సేవా పథకం (ఐ.సి.డి.ఎస్.) అమలు కుంటుపడింది. 1999 మార్చి 31 తో ముగిసిన సంవత్సరపు ఆడిట్ నివేదికలో పేర్కొన్న లోపాలను డిపార్టుమెంటు సరిదిద్దుకోలేదు. ఈ లోటుపాట్లు 2005-10 మధ్య ఐదు సంవత్సరాలలో కూడా కొనసాగుతున్నాయి. అంగన్ వాడీ కేంద్రాలను పెంపొందించటానికి తగిన ప్రాధాన్యత నివ్వలేదు. ఎక్కువ భాగం అంగన్ వాడీ కేంద్రాలు (67 శాతం) అద్దె ఇళ్లలో నడుస్తున్నాయి. వీటిలో రక్షిత మంచినీరు, మరుగు దొడ్ల వంటి కనీస వసతులు లేవు. వంటపాత్రలు కూడ సమకూర్చలేదు. కిశోరప్రాయంలోని బాలికలకు అనుబంధ పోషకాహారం సమకూర్చాలని భారత ప్రభుత్వం 2004 లోనే సూచించినా, ఇంతవరకూ రాష్ట్రంలో లబ్ధిదారులను గుర్తించనేలేదు. నేరుగా తినేందుకు అనువైన ఆహారం (ఆర్.టి.ఇ.)/హాట్‌ఫుడ్ మిక్స్ (ఏ.పి.ఫుడ్స్ సరఫరా చేసేది) సరఫరాల్లో అస్థిరత, నాణ్యత లేని/గడువు మీరిన ఆహారం పిల్లలకు పెట్టటం, అంగన్ వాడీ కేంద్రాలను వైద్యాధికారులు సందర్శించటంలో భారీ లోటు వంటి పలు లోపాలను ఆడిటు గుర్తించింది. రికమెండెడ్ డైటరీ అలవెన్సు ప్రమాణాల మేరకు ఆహారంలో సూక్ష్మపోషకాలు ఉండేలా చూడటంలో కూడా లక్ష్యం నెరవేరలేదు. పిల్లలు బరువు తక్కువగా ఉండటం పోషక లోపాన్ని సూచిస్తుంది. పోషకాహార కార్యక్రమం ప్రభావాన్ని తెలుసు కోవడంలో పిల్లల బరువు చూడటం ప్రాధాన్యత సంతరించుకుంటుంది. ఇంత ముఖ్యమైన అంశాన్ని

విస్మరించారు. లబ్ధిదారులకు మందుల పంపిణీని పర్యవేక్షించే యంత్రాంగం లేదు. సి.డి.పి.ఓ.లను, సూపర్‌వైజర్లను నియోగించటంలో కూడా భారీ లోటు ఉంది. అంగన్ వాడీ కేంద్రాల పనితీరు పై సి.డి.పి.ఓ.లు, సూపర్‌వైజర్ల పర్యవేక్షణ తగినంతగా లేదు.

### 1.6.2 మహాత్మాగాంధీ (కల్వకుర్తి) ఎత్తిపోతల పథకం

మహబూబ్ నగర్ జిల్లాలోని 3.40 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యాలను, జిల్లాలో కరువు పీడిత ప్రాంతాల్లో ఉన్న 303 గ్రామాలలోని 4.36 లక్షల జనాభాకు తాగునీటి సదుపాయాన్ని అందించే లక్ష్యంతో మహాత్మాగాంధీ (కల్వకుర్తి) ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు.

సాగునీటి ప్రాజెక్టులు భారీ వ్యయంతో కూడుకున్నవి కాబట్టి, ఖర్చుకు తగిన ఫలితం పొందాలన్న ఉద్దేశ్యం నెరవేరాలంటే వీటిలో 'నిధుల నిర్వహణ', 'వ్యయ నియంత్రణ' లు అత్యంత కీలకం. సరైన ప్రణాళికా రచన లేకపోవడం, ప్రాజెక్టులోని వివిధ కార్యకలాపాలు/పనులను సరైన క్రమంలో సమన్వయ రీతిలో చేపట్టకపోవడం వలన, అంతగా ప్రాథమ్యత లేని కార్యకలాపాలపై అవసరానికంటే ముందే నిధులను వినియోగించినట్టయింది. కీలకమైన భూసేకరణ ప్రక్రియలో అసాధారణ జాప్యం కారణంగా ప్రాజెక్టు నిర్మాణ కాలం మరింత పెరిగింది. ఫలితంగా, లక్షిత ప్రజలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. నిర్దేశించిన గడువు ముగిసిపోయినా డిపార్టుమెంటు ఒక్క ఎకరానికి కూడా సాగునీటి సౌకర్యం కల్పించలేకపోయింది. వ్యయ నియంత్రణలోని తీవ్ర లోపాలు అధిక ఖర్చుకు కారణమయ్యాయి. తదనుగుణంగా కలిగిన అదనపు ప్రయోజనం కూడా ఏమీ లేదు. పనుల పరిమాణాల్లో తగ్గుదలలున్నప్పటికీ, ఆ మేరకు ప్రాజెక్టు వ్యయం తగ్గలేదు. అధ్వానమైన ప్రణాళికా రచన, ఒప్పందాలలోని లోపాల వలన గుత్తేదార్లు మాత్రమే లాభపడ్డారు.

### 1.6.3 విశాఖపట్నం పట్టణాభివృద్ధి సంస్థ (ఉడా) పనితీరు

విశాఖపట్నం పట్టణాభివృద్ధి సంస్థ (ఉడా) ను ఎ.పి.పట్టణ ప్రాంతాల (అభివృద్ధి) చట్టం - 1975 క్రింద ఏర్పాటు చేయడం జరిగింది (1978 జూన్). ఉడా పరిధి 1,721 చ.కి.మీ. విస్తీర్ణం వరకూ వ్యాపించి ఉంది. ఇందులో విశాఖపట్నం నగరపాలక సంస్థ, నాలుగు మునిసిపల్ పట్టణాలు ఉన్నాయి. బృహత్ ప్రణాళిక (మాస్టర్ ప్లాన్) ను తయారుచేసి, దాన్ని అమలు చేయడం ఉడా ప్రధాన విధుల్లో ఒకటి.

నగరాన్ని ఒక ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పరచి, నగరవాసుల జీవన ప్రమాణాలను పెంపొందించడం కోసం స్థాపించిన ఈ పట్టణాభివృద్ధి సంస్థ తన లక్ష్యాలను సాధించడంలో చాలావరకు విఫలమయ్యింది. మొదటి మాస్టర్ ప్లాన్‌లో లక్ష్యసాధన చాలా తక్కువగా (64 నుండి 100 శాతం) ఉందని ఆడిటు గమనించింది. మాస్టర్ ప్లాన్‌ను అమలు చేయడంలో సంబంధిత శాఖలు/సంస్థలతో సమన్వయం లోపించింది. మాస్టర్ ప్లాన్‌కు విరుద్ధంగా, ఒక్కో కేసులో ఒక్కో విధంగా భూవినియోగంలో మార్పుకి ఆమోదాలు ఇవ్వడం ద్వారా భూమి యజమానులకు అనుచిత లబ్ధి చేకూర్చారు. ఆ విధంగా మాస్టర్ ప్లాన్ మాన్యతను నీరుగార్చారు. కాంట్రాక్టు నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. వార్షిక పద్దులను తయారుచేయడంలో బకాయిలు ఉన్నాయి. నగదు పుస్తకం నిర్వహణలో లోపాలున్నాయి. నగదు పుస్తకం నిల్వలను బ్యాంకు స్టేట్‌మెంట్లతో సరిపోల్చి చూడడం లేదు. సంస్థలో అంతర్గత తనిఖీ లేదు. ఉడాలోని వివిధ విభాగాలు నియమాలను, పద్ధతులను పాటిస్తున్నాయన్న భరోసా లేదు. ప్రజల ఫిర్యాదులను పరిష్కరించే వ్యవస్థ ఏదీ లేకపోవడమనేది, తన బాధ్యతలను నిర్వర్తించడంలో సంస్థకు గాంభీర్యత లేకపోవడాన్ని సూచిస్తోంది.

### 1.6.4 రాజీవ్ యువశక్తి

నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 2004 నవంబరులో రాజీవ్ యువశక్తి (ఆర్.వై.ఎస్.) కార్యక్రమాన్ని చేపట్టింది. మొత్తం రూ106 కోట్లు ఖర్చుచేసిన రాజీవ్ యువశక్తి పథకాన్ని అమలు చేయడంలో వృత్తినైపుణ్యం కొరవడింది. అర్హత ప్రమాణాలు, ఈ ప్రాజెక్టు కింద చేపట్టతగిన కార్యకలాపాల గురించి ప్రచారం ఇవ్వలేదు. లబ్ధిదారుల ఎంపిక విధానం మొత్తం లోపభూయిష్టంగా ఉంది. ఇతర పథకాలు/కార్యక్రమాల కింద లబ్ధిదారులకు ఇచ్చిన ఆర్థిక సాయం గురించి కేంద్రీకృత, అధికారిక డేటాబేస్ లేదు. ప్రాజెక్టు వ్యయం నిర్ణయించేముందు దరఖాస్తుదారులనుంచి ప్రాజెక్టు రిపోర్టులు, బ్యాంకుల నుంచి అసెస్‌మెంట్ రిపోర్టులు అడిగి తీసుకోకపోవటం, సంపద అధారంకాని వ్యాపార కార్యకలాపాలకు, ఇప్పటికే మనుగడలో ఉన్న యూనిట్లకూ, అర్హత లేని వారికీ మంజూరు చేయటం, బ్యాంకులు అప్పులివ్వటంలో తీవ్రజాప్యం, బ్యాంకులిచ్చిన వినియోగ ధృవపత్రాలలో లోపాలు మొదలైనవి ఆడిటు గమనించింది. ఆర్థిక సాయం ఇవ్వబోయే వ్యాపార కార్యకలాపాల సామర్థ్యం మదింపు చేయకపోవటం, కొత్త యూనిట్లు వ్యాపారం సాగించబోయే చిరునామాని పరిశీలించుకోక పోవటం వంటి నిర్వాహక లోపాల వలన లబ్ధిదారుల చెల్లింపుల్లో పెద్ద ఎత్తున ఎగవేతలు (65 శాతం) ఏర్పడ్డాయి. భారీ ఎగవేతలు పథకం అంతగా విజయవంతం కాకపోవటాన్ని సూచిస్తున్నాయి. ఇవి ప్రభుత్వరంగ బ్యాంకుల నష్టాలకు దారితీసాయి.

## 1.7 నియమపాలనపై తనిఖీలో కనుగొన్న ముఖ్యమైన ఆడిటు పరిశీలనలు

కీలకమైన అంశాల్లో ప్రభుత్వ శాఖలు/సంస్థల పనితీరును ప్రభావితం చేసిన అనేక లోపాలను ఆడిటు గమనించింది. అందులో కొన్ని ముఖ్యమైన వాటిని ఈ నివేదికలో పొందుపర్చడం జరిగింది (ఇరవై పేరాలు - ఆర్థిక ప్రభావం : రూ1,480.08 కోట్లు). అవి ఈ కింది వర్గాలకు సంబంధించినవి :

(i) మోసాలు, మోసాలను కనుగొనడం

(ii) ఆర్థికపరమైన ఔచిత్యంపై తనిఖీ; తగిన సమర్ధనీయత లేకుండా చేసిన ఖర్చులు

(iii) పునరావృతమౌతున్న, విస్తృతమౌతున్న అక్రమాలు

(iv) పర్యవేక్షణ/పాలనాపరమైన వైఫల్యాలు

### 1.7.1 మోసాలు, మోసాలను కనుగొనడం

- తొమ్మిది జిల్లాల్లో[5] పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన 162 కేసుల్లో మోసపూరితమైన మెడికల్ రీయింబర్స్‌మెంట్ క్లెయిమ్‌ల ద్వారా రూ2.29 కోట్ల చెల్లింపులు జరిగినట్లు ఆడిటు పరిశీలనలో వెల్లడైంది.

  *(పేరా 3.1.1)*

- ఆదిలాబాద్ జిల్లాలో పాఠశాల విద్యాశాఖ , గిరిజన సంక్షేమ శాఖలకు సంబంధించిన 994 కేసుల్లో మోసపూరితమైన ఎల్.టి.సి. క్లెయిమ్‌ల ద్వారా మొత్తం రూ84.91 లక్షల చెల్లింపులు జరిగాయని ఆడిటు కనుగొంది (పాఠశాల విద్య : 942 కేసులు/రూ80.50 లక్షలు; గిరిజన సంక్షేమం : 52 కేసులు/రూ4.41 లక్షలు). అవసరమైన తనిఖీలను నిర్వహించడంలో డి.డి.ఓ.లు/ట్రెజరీ అధికార్ల వైఫల్యం కారణంగానే ఈ మోసపూరితమైన క్లెయిమ్‌ల చెల్లింపులు జరిగాయి.

  *(పేరా 3.1.2)*

[5] ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, నిజామాబాద్, రంగారెడ్డి, విజయనగరం, వరంగల్

### 1.7.2. ఆర్థికపరమైన ఔచిత్యంపై తనిఖీ, సరైన సమర్థనీయత లేకుండా ఖర్చు చేసిన కేసులు

ప్రజాధనాన్ని ఖర్చు చేసేటప్పుడు ఆర్థిక ఔచిత్యపు సూత్రాలను పాటించడంతో పాటు నిధులను సమర్ధవంతంగా ఖర్చు చేయాల్సి ఉంది. ప్రజాధనాన్ని ఖర్చు చేసే అధికార్లు, ఒక సాధారణ వ్యక్తి తన సొంత సొమ్మును ఖర్చు చేసేటప్పుడు పాటించే విజ్ఞతను పాటించాల్సి ఉంటుంది. ఆడిటు పరిశీలనలో, ఆర్థికపరమైన ఔచిత్యాన్ని పాటించని కేసులూ, అధికంగా ఖర్చు చేసిన కేసులూ వెల్లడయ్యాయి. ఈ కేసుల్లో ముడిపడి ఉన్న మొత్తం రూ17.60 కోట్లు.

- వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం 2003-08 మధ్య కాలంలో 112 హాస్టల్ భవనాలు మంజూరు కాగా, అందులో 70 హాస్టల్ భవనాల నిర్మాణం నిర్దేశించిన రెండేళ్ల గడువును మించి ఆలస్యమైంది (2010 సెప్టెంబరు). దీని వలన లక్ష్యిత విద్యార్థులకు హాస్టళ్లలో మెరుగైన సౌకర్యాల ప్రయోజనం అందక పోవడమే కాకుండా నిర్మాణపు ఖర్చు రూ16.72 కోట్ల మేర పెరిగిపోయింది. అదేవిధంగా, పనికి ఆహారం పథకం కింద మంజూరైన 31 హాస్టల్ భవనాలు కూడా అసంపూర్తిగా ఉన్నాయి.

*(పేరా 3.2.1)*

### 1.7.3 పునరావృతమౌతున్న, విస్తృతమౌతున్న అక్రమాలు

ఏదైనా అక్రమం ఏయేటికాయేడు మళ్లీ మళ్లీ జరుగుతుంటే దాన్ని పునరావృతమవుతున్న అక్రమంగా పరిగణించడం జరుగుతుంది. గతంలో నిర్వహించిన తనిఖీలలో ఆడిటు అభ్యంతరాలను లేవనెత్తినప్పటికీ అవే అక్రమాలు పునరావృతం కావడానికి కార్య నిర్వాహక వ్యవస్థ నిర్లిప్తత, ప్రభావవంతమైన పర్యవేక్షణా లోపాలు కారణం. నియమ నిబంధనలను బుద్ధిపూర్వకంగానే ఉల్లంఘించడాన్ని ఇది ప్రోత్సహిస్తుంది. ఫలితంగా, పాలనా వ్యవస్థ బలహీనపడుతుంది. పునరావృతమవుతున్న, విస్తృతమవుతున్న అక్రమాలకు సంబంధించిన రూ50.60 కోట్లతో ముడిపడి ఉన్న కేసులను ఆడిటు గమనించింది. వాటి వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి :

- అధిక దిగుబడినిచ్చే పాడిపశువుల పంపిణీ పథకం అమల్లో, లబ్ధిదార్ల ఎంపికలో పారదర్శకత, నిజాయితీలు లోపించడం, నాణ్యమైన పశువులు సరఫరా అయ్యేలా చూడకపోవడం, సరఫరా సంస్థలకు చేసే చెల్లింపుల నియంత్రణ లోపభూయిష్టంగా ఉండడం (మొత్తం రూ1.68 కోట్లు) వంటి పలు లోపాలు వెల్లడయ్యాయి. పథకం అమలుతీరుపై పర్యవేక్షణ పేలవంగా ఉంది.

*(పేరా 3.3.1)*

- పార్లమెంటు సభ్యుని స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం అమల్లో పనులు పూర్తి కాకపోవడం, అనర్హమైన పనులను చేపట్టడం, యూజర్ ఏజన్సీలకు ఆస్తులను బదిలీచేయకపోవడం, పూర్తైన పనులకు సంబంధించి మిగులు నిధులను జమచేయకపోవడం మొదలైన రూ48.92 కోట్ల మొత్తంతో ముడిపడి ఉన్న అవకతవకల వలన ఆశించిన ప్రయోజనాలు చాలావరకు ప్రజలకు అందకుండా పోయాయి.

*(పేరా 3.3.2)*

- ఎంపిక చేసుకున్న పాఠశాలల పనితీరును ఆడిటు తనిఖీ చేయగా తరగతి గదులు, గ్రంథాలయ గదులు, ప్రయోగశాలల ఏర్పాటులో కొరత, బెంచీలు, బ్లాక్‌బోర్డులు, మరుగుదొడ్లు, తాగునీరు మొదలైన కనీస మౌలిక వసతులు లేకపోవడం, చాలామటుకు బడుల్లో దృశ్య - శ్రవణ పరికరాలు పనిచేయకపోవడం వంటి అంశాలు వెల్లడయ్యాయి. 2007-08 నుండి 2009-10 మధ్య గల మూడేళ్ల కాలంలో, డి.ఇ.ఓ. లు, డిప్యూటీ డి.ఇ.ఓ.లు చేయాల్సిన తనిఖీల్లో భారీగా 72 నుండి 93 శాతం లోటు ఉంది.

*(పేరా 3.3.3)*

### 1.7.4 పర్యవేక్షణ/పాలనాపరమైన వైఫల్యం

ఆరోగ్యం, విద్య, మౌలిక వసతుల అభివృద్ధి-ఉన్నతీకరణ, ప్రజాసేవలు మొదలైన విషయాలలో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం ప్రభుత్వ బాధ్యత. నిర్ణయరాహిత్యం, పాలనాపరమైన పర్యవేక్షణా లోపం, వివిధ స్థాయిల్లో కలిసికట్టుగా చర్యలు తీసుకోకపోవడం కారణంగా ప్రజలకు ఉపయోగపడే ఆస్తుల కల్పన కోసం విడుదల చేసిన నిధులు వినియోగం కాకుండా పడి ఉండడం/స్తంభించిపోవడం లేదా అవి నిష్ఫలమైన/ అనుత్పాదకమైన కేసులను ఆడిటు గమనించింది. ఈ కేసుల్లో ముడిపడి ఉన్న మొత్తం రూ1,408.74 కోట్లు. వీటిలోని కొన్ని ముఖ్యమైన ఆడిటు పరిశీలనలను ఈ కింద పేర్కొనడం జరిగింది.

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరదనీటి కాలువ (ఎఫ్.ఎఫ్.సి.) ప్రాజెక్టు లోని వివిధ కార్యకలాపాలు/పనులను సరైన క్రమంలో/సమన్వయ రీతిలో చేపట్టక పోవడం వల్ల, అవసరానికి ముందే ప్రాజెక్టు పనులపై భారీగా రూ1,476.30 కోట్లు ఖర్చు చేయడమైంది. రిజర్వాయర్లు పూర్తి అయ్యేవరకూ, ఈ నిధులు ఏ ప్రయోజనం లేకుండా అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులో చిక్కుకుపోయి ఉంటాయి.

  *(పేరా 3.4.4)*

- (i) డాక్టరు కె.ఎల్. రావు సాగర్ (పులిచింతల) ప్రాజెక్టు, (ii) రాజీవ్ భీమ ఎత్తిపోతల పథకం, (iii) కందుల ఓబుల రెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టులకు సంబంధించిన ఒప్పందాల్లో ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడేందుకు తగిన నిబంధనలను పొందుపర్చకపోవడం వలన టెండర్ల ప్రక్రియ ముగిసాక పనుల పరిమాణాల్లో చోటుచేసుకున్న తగ్గుదలల ప్రయోజనాలు ప్రభుత్వానికి ఒనగూరకపోగా, వాస్తవంగా చెల్లిస్తున్న మొత్తాలు చెల్లించాల్సిన విలువ కంటే చాలా అధికంగా ఉండడంతో కాంట్రాక్టర్లకు రూ100.20 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది. అంతేకాకుండా, మూడు ప్రాజెక్టులకు[6] సంబంధించి, ఒప్పందపు షరతులను రూపొందించడం, అమలు చేయడంలోని లోపాల కారణంగా రూ77.67 కోట్ల మేర నివారించదగ్గ ఖర్చుకావడం/కాంట్రాక్టర్లకు అనుచిత లబ్ధి చేకూరడం జరిగింది.

  *(పేరాలు 3.4.3 నుండి 3.4.6 వరకు)*

- సమీకృత దేవాలయాల పర్యటన - టౌన్‌షిప్ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం కింద చేపట్టిన 'శాటిలైట్ - టౌన్‌షిప్' వ్యవహారంలో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) ప్రతీ దశలోనూ మెసర్స్ ఎమ్మార్ ఎమ్.జి.ఎఫ్. ల్యాండ్ లిమిటెడ్‌కు అనుచిత ప్రయోజనం కలిగేలా వ్యవహరించింది. దీనివలన సవరించిన ఒప్పందంలో మొదటి ప్రతిపాదన కంటే రూ580 కోట్ల ఆదాయం తక్కువగా వస్తుంది.

  *(పేరా 3.4.12)*

- ఎనిమిది ప్రాజెక్టుల్లో కాంట్రాక్టర్లకు చెల్లించిన మొబిలైజేషన్ అడ్వాన్సులను ఆడిటు తనిఖీ చేయగా, రూ111.84 కోట్ల అడ్వాన్సుల అక్రమ చెల్లింపు, వడ్డీ రేటును తప్పుగా పేర్కొనడం వలన రూ33.07 కోట్ల రెవెన్యూ నష్టం వంటి పలు లోపాలు వెల్లడయ్యాయి. (ఎ) అటవీ, పర్యావరణ అనుమతులు లాంటి చట్టపరమైన అనుమతులు, (బి) భూసేకరణ, (సి) పునరావాసం వంటి అంశాలను పరిష్కరించకుండానే సివిల్ పనులను ప్రారంభించడం వలన పనుల పురోగతి కుంటుపడింది. ఫలితంగా, రూ702.70 కోట్ల భారీ మొత్తంలో అడ్వాన్సులు కాంట్రాక్టర్ల వద్దనే స్తంభించిపోయాయి.

  *(పేరా 3.4.7)*

---

[6] (i) శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వరద నీటి కాలువ (రూ67.56 కోట్లు), (ii) రాజీవ్ భీమ ఎత్తిపోతల పథకం (రూ7.88 కోట్లు), (iii) కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ ప్రాజెక్టు (రూ2.23 కోట్లు)

- హైదరాబాదు చుట్టు పక్కల ప్రాంతాలను అభివృద్ధి చేయడంకోసం నిర్వహించిన భూముల వేలం ప్రక్రియలో హైదరాబాదు మహానగర అభివృద్ధి సంస్థ టెండరు షరతులకు కట్టుబడి ఉండకపోవడం వలన బిడ్డర్లకు రూ239.88 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.

*(పేరా 3.4.9)*

- తీవ్రమైన విద్యుత్ కొరతను ఎదుర్కొంటున్నప్పటికీ, విద్యుత్ కేంద్రాన్ని నెలకొల్పడంలో విఫలమైన 'మెసర్స్ హిందూజా నేషనల్ పవర్ కార్పోరేషన్ లిమిటెడ్' అనే ఓ ప్రైవేటు సంస్థకు విశాఖపట్నం జిల్లాలో చేసిన భూ కేటాయింపును రద్దుచేసి, సరసమైన ధరకు విద్యుత్తును సరఫరా చేయగలిగే మరే సంస్థకైనా ఆ భూమిని కేటాయించడంలో ప్రభుత్వం విఫలమయ్యింది.

*(పేరా 3.4.14)*

- నాలుగు జిల్లాల్లో (చిత్తూరు, తూర్పు గోదావరి, కరీంనగర్, విశాఖపట్నం) ప్రభుత్వం వివిధ సంస్థలకు చేసిన 50 భూకేటాయింపుల లావాదేవీలను (మొత్తం 77 లావాదేవీలకుగాను) ఆడిట్ పరిశీలించగా ఈ ప్రక్రియలో పారదర్శకత, ధర్మబద్ధత లోపించడమే కాకుండా వివిధ వర్గాల వారికి రూ101.43 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.

*(పేరా 3.4.13)*

- ప్రభుత్వ ప్రయోజనాలను పరిరక్షించే నిబంధనలను ఒప్పందంలో పొందుపర్చకపోవడం వలన పి.వి.ఎన్.ఆర్. ఎలివేటెడ్ ఎక్స్‌ప్రెస్ వే కారిడార్ నిర్మాణం పనుల్లో, టెండర్లు ఖరారైన తర్వాత పరిమాణాల్లోని తగ్గుదల వల్ల వచ్చే ప్రయోజనాలు ప్రభుత్వానికి ఒనగూడలేదు. ఫలితంగా, కాంట్రాక్టరుకు రూ86.67 కోట్ల అనుచిత లబ్ధి చేకూరింది.

*(పేరా 3.4.8)*

- హైదరాబాదు మహానగరాభివృద్ధి సంస్థ చేపట్టిన ఔటర్ రింగురోడ్డు ప్రాజెక్టు మొదటి దశలోని రెండో ప్యాకేజీకి సంబంధించిన టెండరు ప్రక్రియలోని లోపాల కారణంగా అత్యల్ప బిడ్డరు ధరకన్నా రూ23.68 కోట్ల అధిక మొత్తానికి పనులను అప్పగించడం జరిగింది.

*(పేరా 3.4.10)*

- ఎ.సి.బి. ప్రభావవంతంగా పనిచేయగలిగితే, ఆ సంస్థ తన బడ్జెటు (రూ19.27 కోట్లు) కంటే అనేక రెట్ల ప్రయోజనాలను ప్రభుత్వానికి అందించగలుగుతుంది. ఎ.సి.బి. తన విధి నిర్వహణలో వివిధ స్థాయిల్లో ఎదుర్కొంటున్న అవరోధాల కారణంగా, ప్రభుత్వోద్యోగుల పనితీరులో నిజాయితీ, పారదర్శకతలను పెంపొందించాలన్న లక్ష్య సాధనకు తీవ్ర విఘాతం కలిగింది. అంతేకాకుండా, దీనివల్ల ఎ.సి.బి. ప్రభావం నీరుగారిపోయే ప్రమాదం ఉంది.

*(పేరా 3.4.2)*

## 1.8 ముసాయిదా పేరాలు, పనితీరు సమీక్షలపై సంబంధిత ప్రభుత్వ శాఖల ప్రతిస్పందన

ఆర్థిక శాఖ జారీ చేసిన ఆదేశాల పుస్తకంలోని పేరా 4.7, ఇంకా, యు.ఓ.సంఖ్య 23810-సి/200/ప్రజా పద్దుల సంఘం/93-2 తేదీ 1993 నవంబరు 3 లోని ఆదేశాల ప్రకారం, కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికలో పొందుపరచడానికి ప్రతిపాదించిన ఆడిటు పేరాలపై అన్ని శాఖలూ తమ సమాధానాలను ఆరు వారాల్లోగా సమర్పించాలి.

తదనుగుణంగా, ముసాయిదా పేరాలు, పనితీరు తనిఖీకి సంబంధించిన ముసాయిదా సమీక్షలను సంబంధిత శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు/ముఖ్య కార్యదర్శులు/కార్యదర్శులకు పంపి, ఆడిట్ కనుగొన్న అంశాలను వారి దృష్టికి తెచ్చి, ఆరు వారాల్లోపు సమాధానం పంపాలని కోరడం జరుగుతుంది. భారత కంప్ట్రోలర్ మరియు ఆడిటర్ జనరల్ నివేదికల్లో ఆ పేరాలను పొందుపర్చే అవకాశం ఉంది. ఆ నివేదికలను రాష్ట్ర శాసన సభలో ప్రవేశపెట్టడం జరుగుతుంది. కాబట్టి, ఆయా అంశాలపై సంబంధిత ప్రభుత్వ శాఖల కార్యదర్శుల అభిప్రాయాలను కూడా పొందుపర్చాల్సి ఉన్న కారణం గానే ముసాయిదా పేరాలు/సమీక్షలపై వ్యక్తిగత శ్రద్ధ చూపడం కోసం వారికి పంపడం జరుగుతుంది. వీటిపై ప్రధాన మహాగణకాధికారితో చర్చించడానికి సమావేశమవ్వాలని కూడా వారికి సూచించడం జరుగుతుంది.

కానీ, తొమ్మిది ముసాయిదా పేరాలు, పని తీరు తనిఖీకి సంబంధించిన రెండు ముసాయిదా సమీక్షలు/ పెద్ద పేరాలకు[7] తొమ్మిది ప్రభుత్వ శాఖలు[8] తమ సమాధానాలను సమర్పించలేదు. ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా తెలపడమైంది (2010 నవంబరు). తొమ్మిది పేరాలు/నాలుగు పని తీరు సమీక్షలు/ పెద్ద పేరాలపై ప్రభుత్వ శాఖలనుండి అందిన సమాధానాలను నివేదికలో తగిన విధంగా పొందుపర్చడం జరిగింది.

---

[7] సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకం, రాజీవ్ యువశక్తి

[8] ఇంధన శాఖ; ఆర్థిక శాఖ; నీటి పారుదల మరియు ఆయకట్టు అభివృద్ధి శాఖ (నీటి పారుదల, ప్రాజెక్టుల విభాగాలు) ; మునిసిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ; ప్రణాళికా శాఖ; రెవెన్యూ శాఖ; పాఠశాల విద్యా శాఖ; మహిళాభ్యుదయం, శిశు, వికలాంగుల సంక్షేమ శాఖ; యువజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతిక శాఖ (యువజన సేవలు)